
సాక్షి
వరంగల్
ఆదివారం । 20 । జూలై । 2025



ఏడుబావులను చూడగలమా?

మానుకోట జిల్లా బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామ సమీపంలోని ఏడుబావుల జలపాతం సందర్శనను అధికారులు నిలిపివేశారు.

- 8లో▸



ఎకోటూరిజం అభివృద్ధికి అడుగులు! - 8లో▸

ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం శివారులోని ఇనుపరాతి గుట్టలను శనివారం పీసీసీఎఫ్ సువర్ణ, అధికారులు సందర్శించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30^0 /24^0

జిల్లాలో ఉదయం వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాద వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



నర్సంపేట రూరల్: ఎరువులు, పురుగు మందులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ హెచ్చరించారు. నర్సంపేట పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ డీలర్లు గడవుతీరిన పురుగు మందులను రైతులకు విక్రయించొద్దని, ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి శశికాంత్, వ్యవసాయ విస్తరణాధికారి మెండు అశోక్ తదితరులు పాల్గొన్నారు.


నానో యూరియా, డీఏపీతో అధిక ప్రయోజనాలు

- వరంగల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నాగభూషణం

దుగ్గొండి: పంటలకు నానో యూరియా, డీఏపీ వాడితే అధిక ప్రయోజనాలు ఉంటాయని వరంగల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నాగభూషణం అన్నారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలో ఏరువాక- రైతు సాగుబడిపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట పొలాలకు వేసే యూరియా, డీఏపీ 40 శాతం వరకు వృథాగా పోవడంతో పాటు భవిష్యత్‌లో భూమి నిస్సారంగా మారుతుందని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా నానో డీఏపీ, నానో యూరియా వాడాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. పత్తి, మొక్కజొన్న పంటల్లో తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. సదస్సులో జాతీయ ఆహార భద్రతా మిషన్ ప్రతినిధి సారంగం, ఏఓ మాధవి, ఏఈఓ విజయ్‌నాయక్, నాచినపల్లి, పానకల్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలోకి దూసుకెళ్లిన మినీట్రాక్టర్

- ఇద్దరికి తీవ్ర గాయాలు, రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసం



నర్సంపేట రూరల్: కిరాణా దుకాణంలోకి మినీ ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన నర్సంపేట పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నాగుర్లపల్లి గ్రామాన్ని ఇటీవల నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయితే, గ్రామపంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌ను నర్సంపేటలో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్నారు. ఈక్రమంలో శనివారం చెత్త సేకరణలో భాగంగా మల్లంపల్లి రోడ్డు వైపు డ్రైవర్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. వేగంగా వచ్చి కిరాణా డబ్బాలోకి దూ సుకెళ్లింది. డబ్బాలో ఉన్న స్వాతి కాలు విరిగి పోయింది. పక్కనే ఉన్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. ఈ ఘటనలో రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ట్రాక్టర్ సైతం బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు.

నెలకో ఉత్సవం... తియ్యని జ్ఞాపకం

తొలి ఏడాదిలో నెలకోసారి పిల్లల పుట్టినరోజు వేడుక

సరికొత్తగా అలంకరణ.. విభిన్న థీమ్‌లతో నిర్వహణ ● ఏడాది పొడవునా సంబురాలు

● సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ మురిసిపోతున్న తల్లిదండ్రులు

సండే స్పెషల్



సాధారణంగా పుట్టిన రోజు వేడుకలు ఏడాదికోసారి జరుపుకుంటుంటాం. ఇప్పుడు ట్రెండ్ మారింది. పిల్లలు పుట్టిన మరుసటి నెల నుంచే పుట్టిన రోజున సంబురాలు మొదలు పెడుతున్నారు. తొలి ఏడాదిలో నెలకో థీమ్‌తో పిల్లలను వినూత్నంగా అలంకరిస్తున్నారు. కొత్త బట్టలు వేసి ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. కేక్ కట్ చేస్తున్నారు. వాటన్నింటినీ 12 నెలలయ్యాక ఒక చోట చేర్చి ఫొటోఫ్రేమ్‌లు కట్టిస్తున్నారు. వీడియోలు మిక్సింగ్ చేస్తున్నారు. ఫస్ట్ బర్త్ డే వేడుకల వేళ వాటన్నింటినీ బంధువుల ముందు ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వచ్చిన లైకులు, కామెంట్లకు దంపతులు మురిసిపోతున్నారు. ఈనేపథ్యంలో నయా బర్త్‌డే సెలబ్రేషన్స్‌పై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

పెద్దయ్యాక చూసి మురిసిపోతారు..



భూపాలపల్లి అర్బన్: పిల్లల చిన్నప్పటి ఫొటోలు భద్రంగా ఉంచితే పెద్దయ్యాక చూసి మురిసిపోతారు. మా బాబు పుట్టి శనివారంతో నెల రోజులు. అప్పటికప్పుడు ద్రాక్ష పళ్లతో అలంకరించి వేడుకలు జరుపుకున్నాం. ప్రతీ నెల కొత్త బట్టలు వేసి ఒక్కో రకమైన వస్తువులు, సరుకులు, ఇతర పండ్లతో నెలల నంబర్లు వేసి ఫొటోలు దింపుకునేలా ప్లాన్ చేసుకున్నాం. బాబు పెద్దయ్యాక ఈ ఫొటోలు చూసి మురిసిపోతాడు.

- తోనగర్ శిరీష, చెల్పూరు, గణపురం

కలకాలం గుర్తుండాలని..



కాజీపేట: బర్త్ డే జరుపుకోవడానికి వన్ ఇయర్ వరకు ఎదురు చూడడం ఎందుకని.. నెల నెలా ఒక్కో థీమ్‌తో మా బాబును రెడీ చేశా. ఫొటోలు తీసి భద్రంగా ఉంచా. పెద్దయ్యాక చూపిస్తే బాబు కూడా సంబురపడతాడు. ఒకప్పుడంటే కెమెరామెన్ వచ్చి ఫొటోలు తీసేవాడు. ఇప్పుడు ఫోన్‌లోనే ఫొటోలు తీసి ఎడిటింగ్ చేస్తున్నా. మంచి పాటను యాడ్ చేసి సోషల్ మీడియాలో పెడితే చాలా లైక్‌లు, కామెంట్లు వస్తున్నాయి. ఆనందంగా ఉంది.

- నిత్యశ్రీ, కాజీపేట

ప్రతిక్షణం ఓ తీపి గుర్తే..



నర్సంపేట: కన్నబిడ్డ ఎదుగుదలను ఫొటోల్లో బంధించడం ఓ మధురానుభూతి. ప్రతి నెల బాబు పుట్టిన రోజును ఓ వేడుకలా నిర్వహించుకుంటున్నాం. ఆపరేషన్ సిందూర్ పేరుతో యుద్ధం జరిగిన రోజే మా బాబు కాసర్ల విహాన్ రామానుజన్‌రెడ్డి ఆరో నెల బర్త్‌డే జరిగింది. దీనికి గుర్తుగా ఇండియా ఫ్లాగ్, గన్ చూపుతూ చేసిన వేడుక మర్చిపోలేం.

- కాసర్ల కావ్య, నర్సంపేట

ప్రతీ నెల పండుగే..



సాక్షి, మహబూబాబాద్: మా గారాల పట్టి మోజేస్ పాల్ (జాక్) ఈ ఏడాది ఫిబ్రవరి 28న పుట్టారు. ఉమ్మడి కుటుంబం కావడంతో ప్రతీనెల 28వ తేదీ వచ్చిందంటే సాయంత్రం అంతా సందడే.. పిల్లలు, పెద్దలతో ఇంట్లో ప్రతీ పండుగ వాతావరణం నెలకొంటుంది. ప్రతీ నెల పిల్లవాడు పెరిగిన తీరును చూసుకుంటూ.. సంతోష పడతాం.. ఇలా ఇప్పటి వరకు నాలుగు నెలలు గడిచాయి.. ప్రతీ నెల ఫొటోలు తీసి జాగ్రత్తగా ఉంచుతున్నాం. మొదటి పుట్టిన రోజు సమయంలో ప్రతీ నెల తీసిన ఫొటోలు వరుస క్రమంలో పెట్టి ఫ్లెక్సీ తయారు చేస్తాం..

- దామెర ప్రీతి, మహబూబాబాద్

మధురానుభూతి..



జనగామ: ఏడాదికి ఒక్కసారి బర్త్ డే నుంచి.. నెలనెలా వేడుకలు జరుపుకునే ట్రెండ్ కొనసాగుతోంది. మాకు ఒక కూతురు. 3 నెలల బాబు ఆదినందన్ ఉన్నారు. పుట్టగానే 21వ రోజు.. 50.. 100వ రోజుతో పాటు నెలనెలా కొత్త బట్టలతో అలంకరించి కేక్ కట్ చేస్తున్నాం. బిడ్డ జీవితంలో ఈ ఘట్టం మధురానుభూతిగా నిలిచిపోతుంది. ప్రతీ నెల ఫొటోలను భద్రంగా ఉంచుతూ.. ఏడాది జన్మదిన వేడుకల్లో వీటిని ప్రదర్శిస్తాం.

- ఉప్పల పద్మ, జనగామ

మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య, చిత్రంలో ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్ సత్యశారద

గీసుకొండ: మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని ఎంపీ కడియం కావ్య సూచించారు. రూ.10 లక్షల ఎంపీ నిధులతో కొనాయమాకుల వద్ద గల సెర్ప్ ప్రగతి మండల సమాఖ్య భవన ప్రహరీ నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళలు శానిటరీ న్యాప్కిన్ల తయారీలో శిక్షణ పొంది యూనిట్లను నెలకొల్పాలని ఒక డాక్టర్‌గా సలహా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మూడు శిఖలు కలిసి ఉండవనే నానుడి ఉండేదని, అయితే ఆ పరిస్థితి మారిపోయి మహిళలు ఎన్నో విజయాలు సాధిస్తున్నారన్నారు. ఎంపీ కడియం కావ్య తన నియోజకవర్గానికి రూ.65 లక్షల నిధులను కేటాయిస్తే వాటిలో ఎక్కువగా మహిళల సంక్షేమానికి కేటాయించానని తెలిపారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ కేజీబీవీల్లో కూరగాయలు, వంట సామగ్రిని మెనూ ప్రకారం అందించేందుకు గీసుకొండ సంఘాల ద్వారా ప్రయోగాత్మకంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంఘాల వారు ఉత్పత్తి చేసిన వస్తువులను కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డే రోజు స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అదనపు డీఆర్‌డీఓ రేణుకాదేవి, ఈఈ ఇజ్జగిరి, డీఈఈ జ్ఞానేశ్వర్, డీపీఎం దాసు, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం సురేశ్‌కుమార్, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు గట్టు రాధిక, సీసీలు కోల శోభ, కక్కెర్ల సుజాత, గడ్డి అశోక్, కాంగ్రెస్ నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, ఆకుల రుద్రప్రసాద్, కూసం రమేశ్ పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- గత సంవత్సరం కంటే ఎక్కువగా యూరియా నిల్వలు
- సమీక్షలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: గత సంవత్సరం కంటే ఎక్కువగా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయ, సహకార, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం, వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి డీలర్ల నుంచి రైతులకు యూరియా, ఎరువులు పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రతిపక్షాలు అల్ప సంతోషంతో రైతులను రెచ్చగొడుతూ పత్రికల్లో ప్రకటన కోసం హడావుడి చేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, ఆర్డీఓ ఉమారాణి, ఏడీఏ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన.. పర్యవేక్షణ



రైల్వే యూనిట్‌లో పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులు ధర్మారావు, ప్రేమేందర్ రెడ్డి, రావు పద్మ తదితరులు



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు



కార్మికుడిని ఆలింగనం చేసుకుంటున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో కేంద్రమంత్రులు

- పలు విభాగాలను తిరుగుతూ పనుల పురోగతిపై ఆరా
- పనులు సంతృప్తికరమన్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్..
- 40 ఏళ్ల కల నెరవేరుతోందన్న మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- కాజీపేటలో మంత్రులకు ఘనస్వాగతం.. కిక్కిరిసిన జంక్షన్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలు శనివారం పరిశీలించారు. యూనిట్‌లోని పలు విభాగాల్లో జరుగుతున్న పనులను పరిశీలిస్తూ.. పర్యవేక్షిస్తూ వారి పర్యటన సాగింది. పలు విభాగాల్లో పనుల పురోగతిపై కేంద్రమంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాదినాటికి యూనిట్ నుంచి మాన్యుఫ్యాక్చరింగ్ ప్రారంభమవుతుందని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా సివిల్ కన్‌స్ట్రక్షన్ మొత్తం పూర్తవుతుందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. వరంగల్ జిల్లావాసుల 40 ఏళ్ల సాకారమవుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముందుగా ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, రైల్వేస్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ మంత్రి జి.విజయరామారావు, మాజీ ఎంపీ సీతా రాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, అరూరి రమేశ్ ఘనస్వాగతం పలికారు.

రోడ్డుమార్గంలో అయోధ్యపురం యూనిట్‌కు..

కాజీపేట జంక్షన్ నుంచి కేంద్రమంత్రులు నేరుగా రోడ్డుమార్గంలో అయోధ్యపురంలోని యూనిట్‌కు చేరుకున్నారు. మొదట మంత్రులు రైల్వే యూనిట్ లే అవుట్ రూంకు వెళ్లి లే అవుట్‌ను పరిశీలించారు. అనంతరం కాన్ఫరెన్స్‌హాల్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైల్వే యూనిట్ పనుల పురోగతి, కెపాసిటీని స్థానిక రైల్వే అధికారులు వివరించారు. తర్వాత వాహనాలపై రైల్వే యూనిట్ నిర్మాణ షాపులు, ట్రాక్‌లను తనిఖీ చేసుకుంటూ మెయిన్ షాప్ సమీపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి షెడ్లను తనిఖీ చేశారు.

కార్మికులతో మాటామంతి..

యూనిట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కలిసి మాట్లాడారు. పనులు ఎలా సాగుతున్నాయని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఓ కార్మికుడిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం రోడ్డు మార్గం గుండా రైల్వే యూనిట్ సమీపంలో గల అయోధ్యపురం రైల్వే గేట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రత్యేక రైలులో మంత్రులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావు, రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, చాడా శ్రీనివాస్‌రెడ్డి, రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్, సీఎంపీఈసీ మధుసూదన్‌రావు, సీనియర్ డీఎస్టీఈ ప్రియా అగర్వాల్, సీసీఓఎం పద్మజ సీనియర్ డీసీఎం షిఫాలి, ఆర్‌వీఎన్ఎల్ ఎలక్ట్రికల్ జీఎం ఆనంద్ చెక్కిల, ఈఎం మెకానికల్ వంశీ, సీపీఎం సాయిప్రసాద్, పీఈడీ మెకానికల్ మనీష్‌అగర్వాల్, సీపీఆర్వో ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

గంట ఆలస్యంగా పర్యటన..

కేంద్ర మంత్రులు షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1:30 గంటలకు రావాల్సి ఉంది. కానీ, గంట ఆలస్యంగా 2:40 గంటలకు కాజీపేటకు చేరుకున్నారు. దీంతో రైల్వే స్టేషన్‌లో పెద్ద ఎత్తున బీజేపీ నేతలు, జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు వేచి ఉన్నారు. మంత్రులు రాగానే వారిని కలిసేందుకు పోటీపడగా స్వల్ప తోపులాట జరిగింది. పుష్పగుచ్ఛాలు కిందపడ్డాయి. తాము మంత్రులను కలవలేకపోయామని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

వినతుల వెల్లువ - 8లో▸

ఆగని 'నకిలీ బీమా' దందా!

ఆధునిక సాంకేతికతతో ఫేక్ ఇన్సూరెన్స్ కాపీల తయారీ

- ఆర్టీఏ కార్యాలయాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు
- 10 మంది దళారులను అరెస్ట్ చేసిన పోలీసులు

సాక్షి, వరంగల్: వాహనాల నకిలీ బీమా దందా ఆగడం లేదు. ఆధునిక సాంకేతికతతో ఒరిజినల్ ఇన్సూరెన్స్ కాపీ ఉన్నట్లుగానే దళారులు నకిలీ బీమా పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండికొడుతున్నారు. ఆర్టీఏ అధికారుల కళ్లుగప్పి అక్రమ దందా చేస్తున్న 10 మంది దళారులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల ప్రకారం వరంగల్, హనుమకొండ ఆర్టీఏ కార్యాలయాల ప్రాంగణంలో ఉన్న దళారుల కార్యాలయాలపై దాడి చేసి ఫేక్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నకిలీ వీరు చేసే నకిలీ ఇన్సూరెన్స్‌తో ముఖ్యంగా రోడ్డు ప్రమాద సమయంలో బాధితులకు ఎటువంటి పరిహారం అందకపోవడంతో ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. కొందరు భారీ వాహనాల యజమానులు తమకున్న 10 వాహనాల్లో రెండింటికి అసలు ఇన్సూరెన్స్ చేయించి, మిగిలిన వాటికి తక్కువ ఖర్చుతో అయ్యే నకిలీ ఇన్సూరెన్స్ సృష్టిస్తున్నారని పోలీసు విచారణలో దళారులు ఒప్పుకున్నట్లు తెలిసింది. 2021 నవంబర్‌లోనూ నకిలీ ఇన్సూరెన్స్ కేసులో 8 మందిని అరెస్టు చేశారు.

అసలుది పోలినట్టుగానే..

సులభంగా డబ్బులు సంపాదించడంలో భాగంగా నకిలీ ఇన్సూరెన్స్‌లు సృష్టించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దళారులు నేర్చుకున్నారు. ఇందులో భాగంగా బైట్ స్కాట్ సాఫ్ట్‌వేర్, క్యూఆర్ కోడ్ మేకర్ యాప్, బార్‌కోడ్ జనరేటర్, బార్‌కోడ్ రీడర్, డాక్యుమెంట్ పర్సర్, బైట్ స్కాట్ పీడీఎఫ్ ఎక్స్‌ట్రాక్టర్, బైట్ స్కాట్ క్యూఆర్ కోడ్, నైట్రో పీడీఎఫ్ యాప్‌ల గురించి తెలుసుకున్నారు. నకిలీ ఇన్సూరెన్స్ ఇచ్చినా అసలు ఉన్నట్టుగానే కనిపించడంతో పాటు మొబైల్ యాప్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా వచ్చేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ యాప్‌ల సాయంతో వాహనచోదకుడు ఇచ్చిన పాత ఇన్సూరెన్స్ కాపీని నిక్షిప్తం చేసి ఆ తర్వాత కొత్త వివరాలతో ఎడిట్ చేస్తారు. అనంతరం మొబైల్‌లో నిక్షిప్తం చేసుకున్న మోటార్ క్యాలికులేటర్ యాప్ ద్వారా వచ్చే క్యూఆర్ స్కానర్‌లో అప్పటికే కొత్త వివరాలతో ఎడిట్ చేసిన కాపీని కట్ చేసి ఇక్కడ పేస్ట్ చేస్తారు. అనంతరం ప్రింట్ తీసి ఇన్సూరెన్స్ కాపీని వాహనదారుడికి ఇస్తారు. ఆ ప్రింట్‌పై ఉండే క్యూఆర్‌కోడ్ మొబైల్‌లోని మోటార్ క్యాలిక్యులేటర యాప్‌లో క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే బీమా చేయించిన వివరాలతో పత్రం కనిపించేది. దీనిని ఆర్టీఏ అధికారులు, వాహనదారులు పూర్తిగా విశ్వసించేవారు. ఇందుకోసం వాహనదారుల నుంచి రూ.రెండు వేల నుంచి రూ.పది వేల వరకు వసూలు చేసేవారు. ఇటీవల వీరి వద్ద బీమా పాలసీ చేయించుకున్న ఓ వ్యక్తి వాహనం డ్యామేజ్ అయ్యింది. క్లెయిమ్ చేసుకుంటే నకిలీదని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ బడా మోసం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

మొక్కలు మళ్లీ నాటాలి : డీఆర్డీఓ

నల్లబెల్లి: ఎండిపోయిన మొక్కల స్థానంలో మొక్కలు మళ్లీ నాటాలని డీఆర్డీఓ కౌసల్యాదేవి ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం 17వ ప్రజావేదిక శనివారం రాత్రి వరకు నిర్వహించారు. మస్టర్‌లోని హాజరులో వ్యత్యాసాలు, కొట్టివేతలు, ఎండిపోయిన మొక్కలు, సమాచార బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు రూ. 4,32,13,475 విలువైన పనులు చేపట్టారు. కూలీలకు రూ.42,54,053, మెటీరియల్‌కు రూ.79,422 ఖర్చు చేశారు. పంచాయతీరాజ్ విభాగంలో రూ. 47,32,554 ఖర్చు చేయగా కూలీలకు రూ.2,400, మెటీరియల్‌కు రూ.47,30,154 వెచ్చించారు. మన ఊరు-మన బడికి సంబంధించి రూ.17, 53,781 ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి ప్రజావేదికను డీఆర్డీఓ కౌసల్యాదేవి నిర్వహించారు.

తెలుగు విభాగం బీఓఎస్‌గా చిర్ర రాజు

● రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు..



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు శనివారం రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. తెలుగు విభాగం బీఓఎస్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంథిని శంకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో నియమితులై కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన స్థానంలో చిర్ర రాజును నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. అయితే తనను సంవత్సరం పాటు కొనసాగించాలని మంథిని శంకర్ అదేరోజు వీసీ ప్రతాప్‌రెడ్డి వద్దకు వెళ్లి అడిగారు. దీంతో అక్కడే ఉన్న చిర్ర రాజు.. బీఓఎస్‌గా శంకర్‌ను కొనసాగించాలని చెప్పడంతో ఆయనే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కానీ అధికారులు చిర్ర రాజు నియామక ఉత్తర్వులు వెనక్కి తీసుకోలేదు. దీంతో శనివారం చిర్ర రాజు తెలుగు విభాగం బీఓఎస్‌గా రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. వాస్తవంగా మంథిని శంకర్ నుంచి చిర్ర రాజు బాధ్యతలు స్వీకరించాల్సింటుంది. అలా కాకుండా రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు ఇవ్వడంతో తెలుగు విభాగంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ విషయంపై రిజిస్ట్రార్ రామచంద్రంను 'సాక్షి' వివరణ కోరగా తాను హైదరాబాద్‌లో ఉన్నానని, చిర్ర రాజు బీఓఎస్‌గా రిపోర్టు రిజిస్ట్రార్ పేషీలో ఇచ్చారని తనకు సమాచారం ఉందన్నారు. ఇటీవల ఉత్తర్వులు ఇచ్చినప్పుడు శంకర్ తననే కొనసాగించాలని కోరారని, అప్పుడు సరే అని చెప్పిన చిర్ర రాజు.. తాను క్యాంపస్‌లో లేనప్పుడు జాయినింగ్ రిపోర్టు ఇచ్చారన్నారు. ఈవిషయం వీసీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.



ఏడుబావులను చూడగలమా?

జలపాతం సందర్శించాలనే పర్యాటకుల కల నెరవేరేనా?

● ప్రమాదాలతో జలపాతం సందర్శన నిలిపివేత

● భద్రతా చర్యలు చేపట్టి ఈ వర్షాకాలంలోనైనా అనుమతించాలని కోరుతున్న పర్యాటకులు



ఏడు బావుల వద్ద పర్యాటకుల సందడి(ఫైల్)

కొత్తగూడ : చుట్టూ దట్టమైన అడవి. మధ్యలో ఎత్తైన గుట్టలు. గుట్టల సమీపంలో ఆహ్లాదకర ప్రకృతి అందాల నడుమ ఏడు బావుల జలపాతం. వర్షాకాలంలో ఈ ప్రకృతి అందాలు వీక్షించేందుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చే వారు. దారి సరిగా లేకపోయినా నడుచుకుంటూ వెళ్లి ఏడుబావులను చూసి ఆనందించేవారు. అయితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతుండడంతో మూడేళ్లుగా ఇక్కడికి పర్యాటకులను అనుమతించడం లేదు. భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామ సమీపంలోని పాండవుల గుట్టల్లో ఉన్న ఏడు బావుల జలపాతాన్ని ఈవర్షాకాలంలోనైనా సందర్శించే కల నెరవేరుతుందా.? అనే చర్చ సాగుతోంది.

జలపాతం విశిష్టత..

ఈ జలపాతం ఎత్తైన పాండవుల గుట్టల పైనుంచి ఏడు గుట్టలు దాటుతూ భూమిని తాకుతుంది. ఒక్కో గుట్టపై నీరు పోసిన చోట బావి ఏర్పడింది. ఏడు చోట్ల బావులుగా ఏర్పడడం వల్ల ఏడు బావులు అనే పేరు వచ్చింది. పైనుంచి జాలు వారే నీరు ఎంత వచ్చినా 500 మీటర్ల దూరం ప్రవహించి భూమిలో ఇంకిపోతుంది. అన్ని నీళ్లు ఒకేసారి భూమిలోకి ఎలా ఇంకుతాయో అనే అంశమే ఇక్కడి విశిష్టత. దీనిని చూసి తరించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తారు.



ఏడు బావులు చూసేందుకు గుట్ట ఎక్కుతున్న పర్యాటకులు(ఫైల్)

ప్రమాదాలతో సందర్శన నిషేధం..

గుట్టపైకి ఎక్కి ఏడు బావుల్లో స్నానం చేసేందుకు పర్యాటకులు యత్నించి జారి పడడం, కొందరు యువకులు మద్యం మత్తులో గుట్ట ఎక్కడం వల్ల ప్రమాదాలు సంభవించాయి. నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు సందర్శనను నిషేధించారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ఏడు బావులు సందర్శించేలా ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. అలాగే, ట్రెక్కింగ్‌కు కూడా ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. అటవీ శాఖ సిబ్బందిని నిరంతరం కాపలా ఉంచాలని కోరుతున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు పర్యాటకుల కల నెరవేరుతుందని, స్థానికులకు ఉపాధి లభిస్తుందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఏడు బావులకు వెళ్లే అటవీ మార్గం

ప్రమాదాలు జరిగాయనే జలపాతం సందర్శన నిలిపివేత..

"జలపాతం చూసేందుకు వచ్చిన పర్యాటకులు గుట్టలు ఎక్కడానికి ప్రయత్నించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అందుకే జలపాతం సందర్శనను నిలిపివేశాం. పాండవుల గుట్టలు పూర్తిగా అటవీ ప్రాంతం. అందుకే ఇక్కడ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం కష్టం.

-రవికుమార్, ఎస్సై, గంగారం

ఉన్నతాధికారులకు తెలియజేశా..

ఏడు బావులు జలపాతాన్ని అటవీ శాఖ ద్వారా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులకు తెలియజేశా. ప్రభుత్వం అనుమతి ఇస్తే అభివృద్ధి చేయిస్తాం. ఏడు బావులతో పాటు పందెం సమీపంలో అవీ ప్రాంత సందర్శనకు గతంలో ఏర్పాట్లు జరిగాయి. రెండు ప్రాంతాలు కలిపి పర్యాటకుల సందర్శనకు అనుమతి ఉండేలా నివేదికలు పంపాం.

-చంద్రశేఖర్, ఎఫ్‌డీఓ,గూడూరు

సాయం చేద్దాం.. ప్రాణం కాపాడుదాం

● కాలేయ వ్యాధితో బాధపడుతున్న శివప్రసాద్

● వైద్యానికి రూ.10 లక్షల ఖర్చు..

● మరో రూ.5లక్షలు ఉంటేనే ఆపరేషన్..

● చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి

● దాతల సాయం కోసం కుటుంబ సభ్యుల వేడుకోలు

దీన గాథ

జనగామ: అందరం ఒక్కటైతే ఆ ప్రాణం నిలబడుతుంది. చేయి చేయి కలిపితే అతడు బతుకుతాడు. మానవతావాదులు ముందుకు వచ్చి ఆపన్న హస్తం అందించాలని కుటుంబీకులు చేతులెత్తి వేడుకుంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

జనగామ జిల్లా కేంద్రం వీవర్స్ కాలనీకి చెందిన అందె శివప్రసాద్ మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. తండ్రి చిన్నప్పుడే మృతి చెందగా తల్లి మహేశ్వరి కొడుకును పెంచి పెద్ద చేసింది. శివప్రసాద్‌కు పల్లవితో వివాహం చేయగా, ఆ దంపతులకు నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. నెలంతా కష్టపడితే వచ్చే రూ.12వేల వేతనంతోనే శివప్రసాద్ కుటుంబాన్ని పోషించాడు. ఈ క్రమంలో ఇటీవల శివప్రసాద్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెడికల్ టెస్ట్‌లు పూర్తి చేసిన తర్వాత కాలేయ వ్యాధిగా నిర్ధారించారు. కొడుకు కష్టపడితేనే ఇల్లు గడిచే పరిస్థితుల్లో ఆ పెద్ద దిక్కే మంచం పట్టడంతో ఆ నిరుపేద కుటుంబం ఆగమైపోతుంది. శివప్రసాద్‌ను బతికించుకునేందుకు ఉన్న ఆస్తితో పాటు తల్లి, భార్య వద్ద ఉన్న కొద్దిపాటి బంగారాన్ని అమ్మి వైద్యానికి ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రతి నెల మందుల కోసం రూ. 20వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. ఇందుకు రూ.5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పడంతో చిల్లి గవ్వ లేక కుటుంబీకులు తల్లడిల్లిపోతున్నారు. ఆపరేషన్ చేస్తే బతికే అవకాశం ఉండడంతో మనసున్న వారి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ముందుకొచ్చి ఓ ప్రాణం కాపాడాలని కుటుంబీకులతోపాటు అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.



మంచంపై శివప్రసాద్, దాతల సాయం కోరుతున్న తల్లి

ఆర్థిక సాయం చేసే వారు ఫోన్ పే నంబర్‌తో పాటు బ్యాంకు ఖాతాకు నేరుగా పంపించొచ్చు.
ఫోన్‌పే,గూగుల్ పే నంబర్:7036161005(అందె శివప్రసాద్)
బ్యాంకు ఖాతా నంబర్:1682104000047524(ఐడీబీఐ,జనగామ బ్రాంచ్)
ఐఎఫ్ఎస్ కోడ్:ఐబీకేఎల్0001682

బీఆర్ఎస్ పాపాలకు జీవితాంతం జైలులోనే

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నాయిని రాజేందర్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు

హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన పాపాలు, అక్రమాలకు కేసులు పెడితే వారి జీవితం మొత్తం జైలులోనే ఉంటారని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మంలో కేటీఆర్ మాట్లాడిన భాషపై మండిపడ్డారు. సీఎం హోదాను విస్మరించి రేవంత్‌రెడ్డి పట్ల కేటీఆర్ మాట్లాడిన భాష అతని అహంకారానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తుంటే కళ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ చదువుకున్న మూర్ఖుడిలా మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్ ఓ బఫూన్ అన్నారు. దేశం విడిచివెళ్లిన విజయ్‌మాల్యా కంటే అతిప్రమాదకరమైన ఆర్థిక నేరస్తుడు కేటీఆర్ అని అన్నారు. నువ్వు , నీ అయ్య ఉద్యమాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం రాలేదని, పోలీస్ కిష్టయ్య, శ్రీకాంతాచారి లాంటి ఎందరో అమరుల త్యాగఫలితమే స్వరాష్ట్రం వచ్చిందన్నారు. కేటీఆర్ (మైగేట్) శవాల నుంచి వచ్చే ఓ పురుగుగా అభివర్ణించారు. కేటీఆర్ అంతా దిగజారిన నాయకుడిని ఎప్పుడూ చూడలేదన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాదయాత్ర అంటూ మరో డ్రామాకు తెరలేపాడని అన్నారు. ఎన్ని నాటకాలు వేసినా వర్ధన్నపేట, పాలకుర్తి ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

ఎకోటూరిజం అభివృద్ధికి అడుగులు?

● ఇనుపరాతి గుట్టలను సందర్శించిన పీసీసీఎఫ్



ఇనుపరాతి గుట్టలను సందర్శిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం శివారులోని ఇనుపరాతి గుట్టలను శనివారం పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సువర్ణ, హైదరాబాద్ జూ పార్కు సీసీఎఫ్ సునీల్ కుమార్, వరంగల్, హనుమకొండ డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, భద్రాద్రి సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ కృష్ణమాచారి సందర్శించారు. ఈ సందర్భంగా ఇనుపరాతి గుట్టల ప్రాంతంలో అటవీ శాఖకు సంబంధించిన భూముల వివరాలు తెలుసుకున్నారు. గతంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హామీలో భాగంగా జూ పార్కు తరలింపు, ఎకోటూరిజం అభివృద్ధికి అడుగులు పడుతున్నట్లు సమాచారం. హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో విస్తరించి ఉన్న ఇనుపరాతి గుట్టలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సిబ్బందికి సూచించినట్లు సమాచారం. కాగా, దేవునూరు శివారులో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయా గ్రామాల ప్రజల ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీసీఎఫ్ భీమా నాయక్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భిక్షపతి, డీఆర్ఓ మోహన్ లాల్, బీట్ ఆఫీసర్ రతన్ లాల్, కొత్తగూడెం రేంజ్ డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా

● కార్యకర్తలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ భరోసా



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కమలాపూర్: ఎవరూ అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తన అనుచరులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఉద్యమ సమయం నుంచి మీ వెన్నంటే ఉంటూ ప్రస్తుతం మీతోపాటే బీజేపీలో చేరామని, తమకు బీజేపీలో తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అవకాశం ఇస్తారో? లేదోనని ఆందోళన చెందుతున్న ఈటల వర్గీయులు ఇటీవల కమలాపూర్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నేరుగా ఈటలను కలిసి తమ పరిస్థితి వివరించేందుకు శనివారం కమలాపూర్ మండలం నుంచి శామీర్‌పేటలోని రాజేందర్ నివాసానికి వెళ్లారు. అక్కడ ఎంపీతో స్థానికంగా నెలకొన్న పరిస్థితిని వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. అనుచరులు, కార్యకర్తల ఆవేదన అర్థమైందన్నారు. పది రోజులకు ఒకసారి హుజూరాబాద్ వస్తానని, మీ వెంటే ఉండి స్థానిక ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకుంటానని భరోసా ఇచ్చారు.

రైల్వే మంత్రికి వినతుల వెల్లువ..



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ యూనిట్ పరిశీలనకు వచ్చిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు పలువురు వినతులు సమర్పించారు. విజ్ఞప్తులు చేశారు. కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని, రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు 50 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, కాజీపేట బస్టాండ్ కోసం కావాల్సిన స్థలం కేటాయించాలని, చిరువ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని అందరం కోరినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మంత్రి దృష్టికి రైల్వే సమస్యలు..

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రైల్వే జేఏసీ నాయకులు, రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ నాయకులు, రైల్వే ఎస్సీ, ఎస్టీ, రైల్వే ఓబీసీ, రైల్వే పెన్షనర్ల సంఘాలు ఉమ్మడిగా రైల్వే, కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కాజీపేటను డివిజన్ చేయాలని, కాజపేట టౌన్ స్టేషన్‌ను కారిడార్‌గా చేయాలని, రైల్వే ఇన్‌స్టిట్యూట్ (క్లబ్)ను పునరుద్ధరించి నూతన భవనం నిర్మించాలని, ఈఎల్ఎస్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచాలని, కాజీపేటలో 16 రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో దేవులపల్లి రాఘవేందర్, కొండ్ర నర్సింగరావు, కాల్వ శ్రీనివాస్, ఎస్.వెంకట నారాయణ, దిలీప్, ఆర్.రమేశ్, ఎంఎల్.నారాయణ, మాధవరావు, బిల్విందర్, పాషా, మధు, నారాయణ, వెంకటస్వామి, వేదప్రకాశ్, గిరిమిట్ల రాజేశ్వర్, జి.భాస్కర్, పి.రమేశ్ పాల్గొన్నారు. డీఎంఆర్‌కేఎస్ నుంచి యమునాకర్‌రెడ్డి, మంచాల రమేశ్, రాజు, మహేందర్, చంద్రమొగిళి.. రైల్వే మంత్రిని కలిసి కాజీపేట డివిజన్ చేయాలని, పిట్‌లైన్లను వినియోగంలోకి తీసుకురావాలని, రైల్వే లింక్‌లను పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు.

రైల్వే యూనిట్‌లో ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి..

కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డిను కలిసి తమ భూమిని రైల్వే యూనిట్‌కు ఇచ్చామని, తమకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని భూ నిర్వాసితులు గాదెం యాదగిరి, మామిండ్ల భిక్షపతి, జెరుపోతుల కుమారస్వామి, ఉల్లెంగుల శ్రీనివాస్, కాయిత స్వరూప, మామిండ్ల మల్లమ్మ వినతి పత్రం అందజేశారు. జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తమకు వివరాలు పంపిస్తే న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారని గాదెం యాదగిరి తెలిపారు.

పుష్‌పుల్ రైలును పునఃప్రారంభించాలి

ఖిలా వరంగల్ : వరంగల్ నుంచి సికింద్రాబాద్ వరకు పుష్‌పుల్ రైలును పునః ప్రారంభించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అలాగే, నెక్కొండలో శాతవాహన, పద్మావతి, ఇంటర్‌సిటీ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

గంజాయి మత్తులో దాడి..

● ఐదుగురి అరెస్ట్, రిమాండ్

● వివరాలు వెల్లడించిన పోలీసులు

జనగామ: జనగామ పట్టణం గుండ్లగడ్డలో ఓ కుటుంబంపై గంజాయి మత్తులో దాడి చేసిన ఐదుగురు వ్యక్తులను (ఇందులో ఒకరు గంజాయి తీసుకోలేదు) అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ఈ మేరకు శనివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుండ్లగడ్డకు చెందిన ఎండీ. ఫరూక్ ఫైజల్, ఎండీ. షహనాజ్, ఎండీ.అమీర్, ఎండీ.లాయక్, ఎండీ. సుఫియాన్ స్నేహితులు. ఈ నెల15వ తేదీన వీరు అమ్మబావి సమీపంలో ఉండగా ఫరూక్ ఫైజల్ బాబాయ్ హాజీ వచ్చి మిగతా నలుగురిపై ఆగ్రహం వ్యక్తం చేసి అతడిని తీసుకెళ్లాడు. దీంతో హాజీ ఆగ్రహం వ్యక్తం చేశాడనే కక్షతో నలుగురు.. ఫైజల్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఐదుగురు స్నేహితులను విచారించారు. ఈ సమయంలో వారిపై అనుమానం కలగడంతో యూరిన్ ఆధారంగా శాంపిల్ సేకరించి పరీక్షించారు. ఇందులో ఫరూక్ ఫైజల్, షహనాజ్, అమీర్, లాయక్ గంజాయి సేవిస్తున్నట్లు పాజిటివ్ రాగా, సుఫియాన్‌కు మాత్రం నెగిటివ్ వచ్చింది. దీంతో వీరిని అరెస్ట్ చేసి హనుమకొండ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి అడ్డాగా 'జనగామ'..

జనగామలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు పట్టణ వాసులు పేర్కొంటున్నారు. మైనర్, విద్యార్థులు, యువత లక్ష్యంగా ఏజెంట్లు గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అమ్మబావి, ఏబీవీ ఎయిడెడ్ స్కూల్, జ్యోతినగర్ కాలనీ రూట్, బతుకమ్మకుంట, దేవి థియేటర్, ప్రెస్టన్ మైదానం, వీవర్స్ కాలనీ, అమ్మబావి చిన్న మోరీ, నెహ్రూపార్కు నుంచి 60ఫీట్ల రోడ్డు, జిల్లా ఆస్పత్రి ఎదురుగా ఓ వైన్స్ పరిసర ప్రాంతాలు గంజాయి అడ్డాలుగా మారాయని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి మత్తులో పిల్లలను పలకరించే పరిస్థితి లేదని సీనియర్ సిటిజన్లు వాపోతున్నారు. ఈ క్రమంలో పోలీసులు జనగామను గంజాయి రహిత పట్టణంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లిన కారు

● నలుగురికి స్వల్ప గాయాలు

● కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో ఘటన



కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీసుకొస్తున్న ప్రయాణికులు

ఐనవోలు: కారు అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శనివారం మండలం కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్, ఖమ్మం రహదారిపై వేగంగా వెళ్తున్న కారు టైర్ పగిలిపోవడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మామిడి తోటలోకి దూసుకెళ్లింది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అదే రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు స్పందించి వెంటనే కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. అతివేగంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పిడుగుపాటుకు మత్స్యకారుడి మృతి



సుధాకర్(ఫైల్)

సంగెం: చెరువులో చేపలవేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు పిడుగుపాటుతో మృతి చెందాడు. ఈ ఘటన సంగెం మండలం ఎల్గూర్‌రంగంపేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ చెరువులో శనివారం పలువురు మత్స్యకారులతో పాటు బోనాల సుధాకర్(48) చేపల వేటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చి చెరువులో సుధాకర్ సమీపంలో పిడుగు పడింది. దీంతో షాక్‌కు గురైన సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నిర్మల కూతురు, కుమారుడు ఉన్నారు.

తల్లిని మోసగించిన ఎక్సైజ్ కానిస్టేబుల్..

● పింఛన్ పేరుతో భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రబుద్ధుడు



వివరాలు వెల్లడిస్తున్న సూరమ్మ

నల్లబెల్లి: తన కుమారుడు ఎక్సైజ్ కానిస్టేబుల్ కావడంతో అధికారులు ఓ వృద్ధురాలికి ఆసరా పింఛన్ మంజూరు చేయలేదు. దీనిని ఆసరా చేసుకుని ఆ తనయుడు పింఛన్ పేరుతో వ్యవసాయ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని తన తల్లిని మోసం చేశాడు. ఈ ఘటన మండలంలోని రుద్రగూడెంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన లద్దునూరి సూరమ్మ, రాజయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సూరమ్మకు వారసత్వంగా వచ్చిన ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో ఆసరా పింఛన్ మంజూరు కోసం తహసీల్దార్ కార్యాలయం వచ్చి సంతకం పెట్టాలని గూడురులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తన రెండో కుమారుడు యుగంధర్.. తల్లికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన తల్లి నుంచి ఎకరం 10 గుంటలు భూమి కొనుగోలు చేసినట్లు తన భార్య ప్రపూర్ణ పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వృద్ధురాలు సూరమ్మ తనను మోసగించి అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న పట్టాను రద్దు చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణ, ఎస్సై గోవర్ధన్‌కు వేర్వేరుగా ఆశ్రయించి వేడుకుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

TO-LET

■ ఆటోనగర్ ప్లాట్ No. 9920 RCC బిల్డింగ్ 3000 Sqft with ఆఫీస్ రూంతో కిరాయికి ఇవ్వబడును. Cell: 98661 57044. [MW 13751]

PLOT FOR SALE

■ వరంగల్, మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కి కేవలం 1 కి.మీ. దూరంలో KUDA Layout Plots అమ్మకానికి కలవు. వెంటనే ఇండ్లు కట్టుకోవచ్చు. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సెల్: 9573689941 [WA-6730]

SERVICES

శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్

■ ఎంతటి అసాధ్యమైన వ్యాధులకైనను హోమియో వైద్య చికిత్సకై సంప్ర॥ 38 సం॥ల Exp. డా॥ Ch. జితేందర్ BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్. Opp: న్యూ బస్టాండ్, హన్మకొండ. 9849117394 [WA-7570]

ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥, 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి & వంట పనికి మీ ఇంటి వద్దకే అనుభవం గల పర్సన్లని స్త్రీ/పులను పంపించగలము. సంప్ర॥ 8977263124, 9100116067. [WA-6728]

AGRI BUSINESS

■ వరి విత్తనం ANM 12368 మొదటి కిట్ నుండి మొదటిగా సేకరించిన నాణ్యమైన విత్తనం అతికొద్ది మొత్తంలో కలదు. సంప్ర: సెల్: 9652587446. [SCA25006477]

WANTED

■ కంప్యూటర్ ఆపరేటర్ (TALLY) కమ్ Front Office పై వర్క్ చేయుటకు లేడీ కావలెను. చిల్పూరి ఎంటర్‌ప్రైజెస్, HNK. 9849154543. [SCA25006409]

■ యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3 సం॥ల చేసిన అనుభవం గల యువతి, యువకుడు కావలెను. ఆకర్షణీయమైన జీతం. లోకల్ వారికి మాత్రమే. అండర్ బ్రిడ్జి దగ్గర, వరంగల్. సెల్: 9490139696 [WA-6729]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931 [HA-16101]

■ Managers, Officers, Law / IT Officers with experience (including retired) may apply to work in Bhadradri Co-op Urban Bank Ltd, Khammam at various locations. Refer website www.bhadradribank.com. Last Dt: 31-7-2025. Ph: 9603366343 Hr@bhadradribank.com [MH 13721]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275588]

■ హనుమకొండ లోని ప్రముఖ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో హౌస్ కీపింగ్ పని చేయుటకు బాయ్స్ & లేడీస్ అర్జెంటుగా కావలెను. 9గం॥డ్యూటీ 4 వీక్లీ ఆఫ్స్. ESI+PF మంచి జీతం. సంప్ర: 9032153413/ 9550292381 [SCA25006333]

■ ఇంటి పని మనిషి కావలెను. 20 సంవత్సరాల నుండి 30 సం॥ లోపు వారు కావలెను. వెంటనే సంప్రదించండి: సెల్: 9347672025. [SCA25006366]

■ అయినవోలు దగ్గరలో SV కృషి రిసార్ట్స్‌లో పని చేయుటకు బార్య భర్తలు కావలెను. సంప్రదించండి. Cell: 98661 57044. [MW 13753]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.